# * * జీవితాలు * *

రచన :
తలిశెట్టి సభాపతిరావు

మాసిపోయినగడ్డం, ధూళి ధూసరమైన జుట్టూ, చినిగిపోయిన దుస్తులూ, పీక్కుపోయిన ముఖం, విచార పూరితమైన హృదయంతో పిచ్చివాడిలాతయారయ్యాడు మూర్తి. ఏం చేస్తాడు? ఉన్నదంతా సరస్వతికి నైవేద్యంపెట్టి సంపాదించినపట్టా, ఆ కాగితంముక్కతో కడుపునిండేనా? కాలు నిండేనా? ఏదో పెద్దఉద్యోగంజేసి కీర్తి, గౌరవమూ, ధనమూ, దర్జా సంపాదించాలని వేసిన అంచనాలన్నీ గాలిలో మేడలయినయ్. ఎంత చదువుంటేనేం? ఎక్కడకెళ్ళినా, ఎంత మందిని దర్శించినా, ఉద్యోగం సంపాదించలేకపోయాడు. కరువు కాటకాల కాలవాలమైన ఈరోజుల్లో మూర్తి పడుతూన్న బాధ భరించరానిది. తనతోపాటు భార్య లక్ష్మి, కూతురు బేబీకూడా మలమలమాడుతున్నారు. తనలాంటి దరిద్రగొట్టుకు భార్యకావడంవల్లా ఆమె కూడా ఈ క్షామదేవతకు ఆహుతి అయింది. బయట తిరగలేడు. ఇంటికిపోలేడు. కాలం గడవడం ఎలా? పాపం! కడుపార భోజనంచేసి ఎన్నాళ్ళయిందో! బేబీకి వారం రోజులనుండి ఒకటే జ్వరం. బ్రతుకుతుందో లేదో? పసికూన ఇలా మలమలమాడి చావాల్సిందేనా? ఇక మరో దిక్కు లేదా?

రాత్రి పది గంటలయింది. శూన్యహృదయంతోనూ, రిక్తహస్తాల్తోనూ ఇంటికి చేరాడు. బేబీ జ్వరతీవ్రతవల్ల కాబోలు నిద్రబోతోంది. భార్య ఏడ్చి, ఏడ్చి ఆ మంచాన్నానుకుని కునికిపాట్లుపడుతోంది. అది కొంత నయమే! ఆకలిబాధ ఆ కాస్సేపైనా వుండదేమో? మూర్తికి కన్నీళ్ళపర్యంతం అయింది. కట్టుకున్న భార్యనూ, కన్నకూతుర్ని తనలా పోషించలేక జీవిస్తోన్న నిర్భాగ్యులింకా వున్నారా? అనుకున్నాడు. అలాగే గుమ్మాని కానుకుని నిలువబడ్డాడు. "ప్రపంచంలో గౌరవానికి, న్యాయానికి స్థానంలేదు. పెద్ద చదువులు చదివి తనపొట్టనే పోషించుకో లేనప్పుడు, తన చదువుకి, జీవితానికి విలువేది? ఎన్నాళ్ళిలా, ఈ ఆకలిబాధతో అలమటించిపోవాలి? బ్రతకడం కష్టమైపోతోంది. మరణం రాదు" అంటూ ఏవిటేవిటో పిచ్చి పిచ్చిగా ఆలోచిస్తున్నాడు. "అన్యాయంగా ధనం సంపాదిస్తే! ఎలా?...దొంగతనం!... దానికిమాత్రం తెలివితేటలూ, ధైర్యమూవద్దూ? తీరాపట్టుబడిపోతే......" నిట్టూర్పు విడిచాడు......దూరాన పన్నెండు గంటలు కొట్టారు. చివరికి మూర్తి ఏ నిర్ణయాని కొచ్చాడో, చప్పున బయల్దేరి ఆచీకట్లో కలిసి పోయాడు.

గడియారం మరో గంట కొట్టింది. "అమ్మా!" అంటూ మూలిగింది బేబీ. కలతలో కన్నుమూసిన లక్ష్మి మేల్కొంది. "ఏం బేబీ?"

"నాన్న రాలేదా అమ్మా!"

"వస్తారమ్మా తప్పకుండా వస్తారు" అంటూ సముదాయించింది. "ఎక్కడ తిరుగుతున్నారో ఏం బాధపడుతున్నారో ప్రొద్దుటనగా వెళ్లారు—ఇంతటి విశాల సృష్టిలో ఆ భగవంతుడికి మనమే భారమైపోయాము. ఇలా అవస్థలుపెట్టి మాడ్చేకంటే ఒక్కసారిగా చంపెయ్‌రాదూ. జానెడుపొట్ట నిండడానికి కూడా ఆస్కారం లేకపోయింది. ఆయన మాత్రం ఏంచేస్తారు. మానవ ప్రయత్నాలన్నీ చేశారు చేస్తున్నారు. తినేవాళ్ళు అదృష్టవంతులైవుండాలి. పాపిష్టిముఖాన్ని నన్ను పెండ్లాడబట్టే ఇంత కటికదరిద్రం అనుభవించాల్సివచ్చింది" అంటూ దుఃఖింపసాగింది లక్ష్మి. "తినడానికి తిండి, కట్టడానికి బట్ట కూడా లేనప్పుడు, ఇక బేబీకి మందెక్కడ నుండి వస్తుంది. ఏడాక్టరు డబ్బు లేకుండా వైద్యంచేస్తాడు. ఇచ్చేవి రంగునీళ్ళయినా, దక్షిణలేనిదే ఇచ్చే దయా దాక్షిణ్యాలున్న డాక్టరు ఏడీ? రోజురోజుకు బేబీ జ్వరం హెచ్చుతోందే కాని తగ్గటంలేదు. క్షణ క్షణం ఆమెస్థితి మారుతోంది. తను ఆడది ఏం చెయ్యగలదు. ఎవరు ఈ ఆపదలకు అడ్డుకుంటారు" అంటూ విచారిస్తోంది. ఏడ్చిఏడ్చి ఆమె కండ్లుకూడా పొడికండ్లయ్యాయి.

బయట ఎవరో పరుగెత్తిన చప్పుడు తలుపుతెరుచుకుని మూసుకుంది. కంగారుగా మూర్తి వచ్చాడు. పరుగెత్తడంవల్లా అలిసిపోయాడు. ముచ్చెమటలుపోశాయి. వస్తూనే "లక్ష్మీ! మన దరిద్రంతీరింది" అంటూ జేబులోంచి నోట్లు తీశాడు.

లక్ష్మి ఆశ్చర్యపోయింది. "ఏమిటీ? ఇంత ధనం ఎక్కడిది? ఎలా తెచ్చారు?" అంది.

"ఎక్కడైతేనేం మనదేలే. త్వరగా తీసి దాచు. ఊ! త్వరగా!" అంటూ తొందర పెట్టాడు.

"ఏవిటీ కంగారు. పొరపాటున ఏ అవినీతికార్యమైనా చెయ్యలేదు కదా?"

"నీతో అవినీతో. బ్రతకడానికి కావలసింది డబ్బు. నీ కవన్నీ ఎందుకు. కానియ్"

ఇంతలో మళ్లీ తలుపుతెరుచుకుంది. ప్రవేశం పోలీసులు. "తిన్నగావచ్చి చెరోదండా పట్టుకు లేవదీశారు "ఏదాడబ్బు? దొంగ వెధవా?" అంటూ. మూర్తి తెల్లపోయాడు.

పూర్తిగా అర్థమయింది లక్ష్మికి. "ఏమిటీ! దొంగతనం చేశారా?......మీరు? మానాభిమానాలు లేని నీచకార్యం. గౌరవంగా ఒక మూల పస్తుపడి చావడంకంటే దొంగతనమే మేలనుకున్నారా? అంతటితో కష్టాలన్నీ గట్టెక్కాయనుకున్నారా? ఏ దుర్ముహూర్తాన పుట్టింది మీకీబుద్ధి. ఇంతాజేస్తే బ్రతకడానికేనా. మీ చదువూ, విజ్ఞానం, మీవయస్సు మిమ్మల్ని అడ్డుపెట్టలేదా. కష్టాలనుభవించి అనుభవించి ఘనీభవించిన మీ హృదయం ఇంతటి దారుణకృత్యానికి ప్రోత్సహించిందా? ఎంతపనిజేశారు!" అంటూ గొల్లుమంది.

"భలే మాటకారిలా వుందిరోయ్!" అంటూ తోసుకపోయారు మూర్తిని ఆ పోలీ

సులు. అసలే దుఃఖభారమైన జీవితం, మూర్తి జైలుప్రాప్తితో చిందరవందరైంది. ఉన్న ఒక్క ధైర్యమూ దూరమైంది. భావి అగమ్య గోచరం.

వారం గడిచింది. బేబీపరిస్థితి ప్రమాదంగా వుంది. తను కన్నకడుపును రక్షించుకోవడం ఎలా? ఒకవేళ బేబీ మరణిస్తే? ఇక తను జీవించి ఎవరికోసం?... ఏ డాక్టరు తన పరిస్థితి వింటాడు? ఏ హృదయం తనపాలిటి దయామూర్తి అవుతుంది? భగవంతుడిమీద భారం వేసి బయల్దేరిందా అర్ధరాత్రి. "డాక్టరుగారూ!" అంటూ భయపడుతూనే తలుపు తట్టింది.

"ఏం? ఎందుకు?"

"రక్షించండి బాబూ! పదిహేను రోజుల నుండి నా బేబీ జ్వరంతో బాధపడుతోంది. ఈరాత్రి చాల ప్రమాదంగా వుంది. మీ రుణం ఎలాగైనా తీర్చుకుంటాను బాబూ! కన్నకడుపు దీనారావాన్ని గుర్తించండి స్వామీ!" అంటూ డాక్టరు కాళ్ళమీద పడింది. "ఫో! ఫో! అర్ధరాత్రివచ్చి బంగారం లాంటి నిద్రపాడుచేశావే. ఇదేంధర్మాసుపత్రి అనుకున్నావా? ఐదు రూపాయలవుతుంది ఫీజు" అంటూ ధభేలున తలుపు బిగించాడు. పాపం! ఆమె రోదన అరణ్యరోదనమైంది. ఇంకేం చెయ్యడం? బేబీ నెలా బ్రతికించడం?

కాళ్ళీడ్చుకుంటూ బయల్దేరింది. చీకటి రాత్రి. ఒంటరిగా వీధిలో స్త్రీ. బెదురుతూ బెదురుతూ తడబడుతూన్న 'అడుగులతో పోతోంది. ఈకాలపు కాముక ప్రపంచం వూరుకుంటుందా? అనుకున్నట్లే అడ్డుతగిలాడు. ఎలా తప్పించుకోవడం? ప్రాణం పోతే పోయింది మానరక్షణ? భగవంతుడా నీదే భారం అనుకుని అడుగులవేగాన్ని హెచ్చించింది లాభం లేకపోయింది. రానేవచ్చాడు. తన ఇనపచేతుల్లో పట్టుకున్నాడు. రాక్షసిలా వున్నాడు. ఇంతకన్న తనొక్కసారి పీక పిసికి చంపరాదూ. ఎన్నాళ్లనుండో తిండిలేక సంపాదించుకొన్న ఆమె బలహీనత ఆమెను రక్షించలేకపోయింది. విదిలించుకో ప్రయత్నించింది......"రా! ఐదు రూపాయలు!" అంటూ ఆశపెట్టాడు. ఐదు రూపాయలు! అవును తనకు కావాలి. తప్పకుండా కావాలి. తన బేబీ ప్రాణం రక్షించడానికి డాక్టరుకు ఇవ్వాల్సిన ఫీజు! కాని... కాని తన మానాభిమానాలు? తన సతీత్వం? ధర్మం! ధ్వంసం అవుతాయి......కాని బేబీ బ్రతుకుతుంది... తన కూతురు ప్రాణం రక్షింపబడుతుంది.

దూరాన గడియారం మూడు గంటలు కొట్టింది. లక్ష్మి డాక్టరు ఇంటికిపరుగెత్తింది.

"డాక్టరుగారూ!"

"ఏం! మళ్లా వచ్చావే" అంటూ విసుక్కున్నాడు.

"ఇవిగో మీరు కోరిన అయిదు రూపాయలు. త్వరగా రండి బాబూ! నా కూతురును రక్షించండి స్వామీ!"

"ఆ!" ఆశ్చర్యపోయాడు డాక్టర్. "పద వస్తున్నా" అంటూ బయల్దేరాడు. తిన్నగా ఇంటికి తీసుకవచ్చింది. డాక్టరు బేబీను పరీక్షించాడు. నిట్టూర్పు విడుస్తూ లేచాడు.

"ఏం బాబూ! మందివ్వరేం?" అంది లక్ష్మి ఆతృతగా.

"ఆపిల్ల మరణించింది!" అంటూ చావు కబురు చల్లగాచెప్పి, అక్కడనుండి జారాడు.

"ఆ! నాబేబీ పోయిందా? ... బేబీ!" అంటూ కౌగలించుకుంది. కుమిలి కుమిలి ఏడ్చింది.

ఇందుకేనా ఇంతకష్టపడింది. తన మానాభిమానాల్ని ఒక నీచునిపరంచేసింది ఈవార్త వినడానికేనా? డాక్టరుకు అప్పుతీర్చింది. కాని తనకూతురు ప్రాణం రక్షించలేకపోయింది. తన కడుపుతీపిలో దూరాలోచన చచ్చింది... అంతా అయింది. ఇక మిగిలింది పతిత అయిన తనొక్కర్తా? దేనికోసం? ఎవరికోసం? ఈ బాధలు పడుతూ, ఈ నీచమయిన జీవితాన్ని గడపడానికా? ఏముఖంపెట్టుకుని ... ఇంతకన్న చావు మేలు! ఏబాధలూ వుండవే. అదే ఆమె తుదినిర్ణయం. బేబీశవాన్ని భుజం మీద వేసుకబయల్దేరింది. సముద్రపుటొడ్డుకు చేరింది. ఇంతకన్న ప్రశాంతమయిన ప్రదేశం ఏదీ? అలాగే వెళ్ళిపోతూంది. లోతు తెలియకండా. అంతే! ఏమయిందో! ఏమో! మళ్ళీ కనుపించలేదు. సముద్రం ప్రశాంతంగావుంది. ప్రపంచంలో ఎక్కడా ఈమె మరణవార్త వినిపించనేలేదు. లోకం పోకడ యధాప్రకారం సాగుతూనే వుంది___.


# జీవానందరసాయనము

ఊరపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువల్లన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్భలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహాభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టి మాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తి విహీనమై దుర్భలమైన గుహ్యోదయమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు బుతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

**ధనలక్ష్మి అండు కో., సాకారుపేట పోస్టు, మదరాసు.**